క్లుప్తంగా

రంజాన్ తోఫా పంపిణీ



మసీదు సభ్యులకు నిత్యావసర సరకులు అందిస్తున్న శ్రీరామ్

భీమునిపట్నం: ముస్లిం కుటుంబాలకు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. భీమిలిలోని జామియా మసీద్‌వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 25 పేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, పంచదార, సేమియా, గోధుమ పిండి, వంటనూనె, జీడిపప్పు, నెయ్యి తదితర సరకులు అందించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అన్వర్, కార్యదర్శి బాషా, సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకార యువతకు వ్యాయామ పరికరాలు



మత్స్యకార యువకులకు జిమ్ పరికరాలు అందిస్తున్న దివీస్ జీఎం రావు

భీమునిపట్నం: భీమిలిలోని మత్స్యకార యువతకు చిప్పాడ దివీస్ కంపెనీ గురువారం రూ. 3 లక్షల విలువైన వ్యాయామ పరికరాలను అందించింది. కంపెనీ జనరల్ మేనేజర్ ఎం.ఎ స్.ఎస్.రావు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార యువత ఆరోగ్యం కోసం ఈ వ్యాయామ పరికరాలు అందిస్తున్నామన్నారు. మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు మాట్లాడుతూ కోరిన వెంటనే పరికరాలను అందించిన దివీస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకార పెద్దలు నాగరాజు, దుర్గారావు, కాశీరావు, అనిల్, శివ, శోభరావు, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధి పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా శివాలయం వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో శివలింగం

పీఎం పాలెం: కారుషెడ్ కూడలికి సమీపంలో కొలువుదీరిన శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షిక వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున 4 గంటల నుంచే ఆది దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు ఉత్సవమూర్తుల తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపించారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

31న పీఏసీఎస్ మహాజన సభ

తగరపువలస: తగరపువలస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఈ నెల 31 ఉదయం 10 గంటలకు మహాజన సభ నిర్వహించనున్నారు. 2025–26 సంవత్సరానికి అంచనా ఆదాయ వ్యయాల ఆమోదం, రూ.300 లోపు షేరుధనం కలిగిన సభ్యులను తొలగించడం, మహిళలకు జేఎల్‌జీ రుణాల మంజూరు, సభ్యుల సేవింగ్ ఖాతాలపై 4 శాతం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఏడాది కాలపరిమితికి 7.80 శాతం వడ్డీ తదితర అంశాలపై చర్చ ఉంటుందని సెక్రటరీ ఉమామహేశ్వరరావు తెలిపారు. సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

రీ సర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: త్వరలో చేపట్టనున్న రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ కె.ఆనందరావు కోరారు. మండలంలోని పాండ్రంగిలో రీ సర్వేపై గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రీ సర్వే చేసేటప్పుడు రైతులు తమ భూముల వద్ద ఉండి, వాటికి సంబంధించిన ఆధారాలు, భూముల హద్దులను సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ వరలక్ష్మి, ఆర్ఐ శ్యామల, సర్వేయర్లు పాల్గొన్నారు.



చిట్టివలస చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్

వాకింగ్ ట్రాక్

పూర్తయ్యేనా?

కొనసా..గుతున్న చిట్టివలస చెరువు సుందరీకరణ

కోట్లు వెచ్చించినా అసంపూర్తిగానే.. • స్థానికులకు తప్పని నిరీక్షణ

కోట్ల రూపాయలు వెచ్చించినా చిట్టివలస చెరువు వాకింగ్ ట్రాక్ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. చెరువు సుందరీకరణ కోసం వలస ప్రజాప్రతినిధులు ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ అవేవీ అమలు కాలేదు. దీంతో స్థానికుల చిరకాల స్వప్నం నెరవేర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు 6.50 కోట్లు మంజూరు చేసింది. చాలావరకు పనులు కూడా చేపట్టారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో మళ్లీ ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందాన మారింది.



అసంపూర్తిగా చెరువు గట్టు ప్రవేశద్వారం



వాకింగ్ ట్రాక్‌పై ముళ్ల కంచెలు

తగరపువలస: సువిశాల చెరువు ప్రాంగణం సుందరీకరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని స్థానికులు నిరీక్షిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా వారి నిరీక్షణ మాత్రం ఫలించడం లేదు.

అరచేతిలో స్వర్గం చూపించి..

భీమిలి రోడ్డును ఆనుకుని చిట్టివలస సర్వే నంబర్ 24లో ఎ.36.40సెంట్లు విశాలమైన చెరువు ఉంది. ఇందులో ఈ ప్రాంతానికి చెందిన సంప్రదాయ మత్స్యకారులు ఏటా చేపలసాగు చేపడుతుంటారు. ఈ చెరువును స్థానికుల కోసం సుందరీకరణ పనులు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని 17 ఏళ్లుగా వలస ప్రజాప్రతినిధులు ఇస్తున్న హామీలు చెరువులో కలిసిపోయాయి. చెరువుకు నాలుగు వైపులా వాకింగ్ ట్రాక్, ట్రాక్‌పై సిమెంట్ బెంచీలు, విద్యుద్దీపాలు, చెరువులో బోటు షికారు, చిన్నారులు ఆడుకోవడానికి ఆటవస్తువులతో కూడిన పార్కు ఇలా పలు మార్లు చెరువు వద్ద గ్రాఫిక్స్ ప్రదర్శించి అరచేతిలో స్వర్గం చూపించారు. 2018లో అన్నంతపని చేస్తారన్న అనుమానం కూడా ఈ ప్రాంత ప్రజలకు వచ్చింది. జీవీఎంసీ అధికారులు అకస్మాత్తుగా చెరువులో చేపలు ఎదగకుండానే మత్స్యకారులతో ఖాళీ చేయించి ఎండగట్టించారు. అడుగున ట్యాంకు నిర్మాణం చేపట్టి చేపల పెంపకానికి కృత్రిమ ట్యాంకు ద్వారా బ్రీడ్ ఉత్పత్తి కూడా చేస్తామన్నారు. దీని కోసం అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు రూ.1.98 కోట్ల నిధులు మంజూరు చేయించారు. కట్ చేస్తే చెరువుకు రెండు వైపులా గట్టు నిర్మించడంతోనే పుణ్యకాలం గడిచిపోయింది.

రోడ్డుపైనే వాకింగ్..

ఈ ప్రాంతంలో స్థానికులకు వాకింగ్ చేసేందుకు సరైన ప్రాంతం లేకపోవడంతో భీమిలి రోడ్డుపై వాకింగ్ చేస్తున్నారు. ఒక్కోసారి వాహనాల బారిన పడి ప్రమాదాలపాలవుతున్నారు. వాకింగ్ ట్రాక్ ఎప్పుడు పూర్తవుతుందా అని వీరంతా ఎంతో నిరీక్షిస్తున్నారు. అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. తుప్పలు తొలగించి విదుద్దీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువై..

ప్రస్తుతం ఈ చెరువు గట్టుపై ఉన్న వాకింగ్ ట్రాక్ చూస్తే గుండె గుభేల్‌మనడం ఖాయం. రక్షణ కంచె ఆధారంగా, చెరువు వైపు నుంచి తుప్పలు పెరిగిపోయి ట్రాక్‌పై అడ్డంగా కనిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో ట్రాక్ ఎక్కడికక్కడ బీటలు వారడంతో పాటు పెద్ద గోతులు ఏర్పడి విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంది. మూడు చోట్ల నాసిరకం గేట్లు పెట్టి నిర్వహణ గాలికి వదిలేశారు.

గత ప్రభుత్వ హయాంలో..

ప్రజల అభీష్టాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెరువు సుందరీకరణకు నడుం బిగించింది. రూ.6.50 కోట్లు మంజూరు చేయడంతో పనులు చేపట్టారు. చెరువుకు రెండువైపులా ఉన్న వాకింగ్ ట్రాక్‌కు రక్షణ కంచె నిర్మించి, ట్రాక్ పోల్చారు. ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. 9 మాసాలు పూర్తయినా చెరువు అభివృద్ధి పనులు అంగుళం కూడా కదలలేదు. దివీస్ లేబరేటరీ యాజమాన్యం చొరవతో పూర్తి చేయనున్నట్టు ప్రకటించారు.

ఒంటరిగా రాలేం



వాకింగ్ ట్రాక్‌పై వసతులు లేకపోగా ముళ్ల కంచెలు పెరిగిపోయాయి. దీంతో వాకింగ్ కోసం ఒంటరిగా రాలేక చాలామంది ఉండిపోతున్నారు. అత్యవసరంగా తుప్పలు తొలగించి లైట్లు ఏర్పాటు చేయాలి. – మీసాల శ్రీనివాసరావు, కొత్తపేట

ఆకతాయిలకు కేరాఫ్‌గా చెరువు గట్టు..

ట్రాక్‌పై కూర్చోవడానికి సిమెంట్ బెంచీలతో పాటు విద్యుద్దీపాలు కూడా లేవు. దీంతో వేకువ జామున గాని, సాయంత్రం చీకటి పడిన తరువాత కాని వాకర్లు ఈ చెరువు గట్టుపైకి వెళ్లలేకపోతున్నారు. వాకింగ్ ట్రాక్‌పై ఉన్న తుప్పల మధ్య నిత్యం పేకాటలు, చీకటిపడితే మందుపార్టీలు తప్పనిసరి.



చెరువు గట్టుపైకి అసంపూర్తిగా నిర్మించిన మెట్లు

రహదారిపై ప్రమాదాలు



ఈ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ వంటి సదుపాయాలు లేక చాలామంది తగరపువలస–భీమిలి రోడ్డులో వాకింగ్, రన్నింగ్ చేస్తూ వాహనాల నుంచి ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు. చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

–దల్లి అప్పలరెడ్డి, జీరుపేట

యువతకు ఎంతో ఉపయోగం



ఈప్రాంత యువతకు సరైన క్రీడామైదానాలు, వాకింగ్ ట్రాక్‌లు లేవు. వీటి కోసం భీమిలి వుడా స్టేడియం దగ్గరకు వెళ్లాలి. చెరువు నాలుగు వైపులా విశాలంగా ఉన్నందున పనులు జరిగితే, దీనిని వినియోగించుకోవచ్చు. జీవీఎంసీ ఆలస్యం చేయకుండా అందుబాటులోకి తీసుకురావాలి.

– ఎం.ఎ.ఎస్.రెడ్డి, విశ్రాంత సుబేదార్, సంతపేట



వాకింగ్ ట్రాక్‌పై బీటలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం/పీఎం పాలెం: పద్మనాభం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గోస్తని ఫీడర్‌కు ఆర్‌డీఎస్ఎస్ ప్రాజెక్టు పనులు చేపట్టనున్నందున ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విశాఖపట్నం జోన్– 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

బక్కన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో.. : బక్కన్నపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చెందిన 11 కేవీ సిద్ధార్థ నగర్ ఫీడర్‌పై విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్–3 ఈఈ (ఆపరేషన్స్) శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా సిద్ధార్థనగర్ లే అవుట్, గాయత్రీనగర్ లేఅవుట్, జీఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ పరిసర ప్రాంతాలకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నాటకం ద్వారా విప్లవాత్మక మార్పులు

మధురవాడ: నాటక రంగం ప్రజల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను జాగృతం చేయడానికి ఈ కళ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. పాఠశాలల్లో బోధనలో నాటకీకరణ, డ్రామాలు ఎంతో గొప్ప ప్రక్రియలన్నారు. నాటకరంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు స్కిట్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాటకాలకు బహుళ ఆదరణ

తగరపువలస: రంగస్థల ప్రక్రియగా విలసిల్లిన నాటకానికి బహుళ ప్రజాదరణ ఉండేదని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. గురువారం ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా రెండో తరగతి విద్యార్థులకు నాటకరంగంపై అవగాహన కల్పించారు. నాటకం కాలక్రమంలో రూపం మార్చుకుంటూ విశ్వజనీయమైందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాటకరంగానికి సంబంధించిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఇన్విజిలేషన్ బాధ్యతల నుంచి ఇద్దరు తొలగింపు

తగరపువలస: భీమిలి కేంద్రంగా జరుగుతున్న ఓపెన్ పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇద్దరు ఉపాధ్యాయులను ఇన్విజిలేషన్ బాధ్యతల నుంచి తొలగించిన విషయం ఆలస్యంగా తెలిసింది. ఈ విషయాన్ని విద్యాశాఖ గోప్యంగా ఉంచింది. పదో తరగతి పరీక్షలకు సంబంధించి జరుగుతున్న మాల్ ప్రాక్టీస్ పక్క మండలానికి చెందిన ఎంఈవో ఆధ్వర్యంలో స్క్వాడ్ తనిఖీలో బట్టబయలైంది. దీంతో ఆ ఉపాధ్యాయులను గురువారం నుంచి పాఠశాలలకు పంపించారు. ప్రస్తుతం జరుగున్న ఓపెన్ పరీక్షలకు సంబంధించి ఇన్విజిలేషన్, సిట్టింగ్ స్క్వాడ్‌లకు పక్క మండలాల ఉపాధ్యాయులను తరలించడం అనుమానాలకు దారితావిస్తోంది. ఒక్కసారి కూడా ఇన్విజిలేషన్ చేయని ఉపాధ్యాయులను ఏరికోరి, పక్క మండలాలలో సిట్టింగ్ స్క్వాడ్ బాధ్యతలు అప్పగించడం వెనుక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉన్నట్టు తెలుస్తోంది. సొంత మండలాలలో ఇన్విజిలేటర్ల కొరత ఉన్నా పక్క మండలాలకు ఎందుకు పంపిస్తున్నారన్న అపవాదు వినిపిస్తోంది. దీనివెనుక పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

తగరపువలస: అగ్ని ప్రమాదాల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి డి.నిరంజన్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన భీమిలి మండలం తాళ్లవలసలోని చిట్టివలస అగ్నిమాపక కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనం, అగ్నిమాపక పరికరాలు, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వేసవి కారణంగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉంటుందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి నష్టం లేకుండా చూడాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఆయన వెంట అగ్నిమాపకశాఖాధికారి జి.శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.



చిట్టివలస సిబ్బందికి సూచనలు ఇస్తున్న ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి నిరంజన్‌రెడ్డి

శ్మశానవాటికకు రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

పద్మనాభం: పద్మనాభం గ్రామంలోని శ్మశానానికి సిమెంట్ రోడ్డును నిర్మించేందుకు తహసీల్దార్ కె.ఆనందరావు గురువారం స్థలాన్ని పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి సర్వే నంబర్ 58/2లో పది సెంట్లు స్థలాన్ని ఇవ్వడానికి క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, టీడీపీ నాయకుడు కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

నూకాలమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సమర్పించేందుకు సారె, చీరలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న భక్తులు

పీఎం పాలెం: కొత్త అమావాస్య సందర్భంగా ఏటా ఆర్‌హెచ్ కాలనీలో నిర్వహించే నూకాలమ్మ పండగ ఉత్సవాలు గురువారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఉగాది పర్వదినానికి మూడు రోజుల ముందు నుంచి అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా పీఎం పాలెంలోని వివిధ కాలనీల ప్రజలు ఆర్‌హెచ్ కాలనీ ముస్లిం కాలనీకి వెళ్లే రోడ్డులో ఉన్న అమ్మవారి గుడికి సారె, చీరలతో ఊరేగింపుగా వెళ్లి, పసుపు కుంకుమలు సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆరో వార్డు నాయకులు పోతిన ప్రసాద్, యల్లాజీ, కేఎస్‌పీ ప్రమోద్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ ఉత్సవం



ఆడపడుచులకు చీరలు అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్దిలో కంటుబోతు వారి ఇలవేల్పు సత్తెమ్మ ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఐదు గంటల నుంచే ఆలయంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. గ్రామస్తులు సత్తెమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించున్నారు. మూడు వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కంటుబోతు వారి ఆడపడుచులకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుగత శ్రీనివాసరావు, బుగత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మసాచుసెట్స్ గ్లోబల్ వీక్‌కు ఓక్రిడ్జ్ విద్యార్థులు



మహాలక్ష్మి



షైలీ

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు మహాలక్ష్మి, షైలీ మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(యుఎస్ఏ)లో జరగనున్న గ్లోబల్ స్టీమ్ వీక్ కార్యక్రమానికి ఎంపికయ్యారు. నార్త్ ఆంగ్లియా స్కూళ్లకు చెందిన 62 మంది విద్యార్థులకు అవకాశం రాగా, మన దేశం నుంచి నలుగురు విద్యార్థుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొననుంది. ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ తమ పాఠశాలలోని ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శిస్తారన్నారు.

నూకాలమ్మ ఉత్సవాలు ప్రారంభం



భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ వారి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30న ఉత్సవాలు జరగనుండగా, తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. ఆలయ ఈవో బి.మురళీమోహన్ ఆధ్వర్యంలో క్యూ లైన్లు, టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. విశాఖ, తగరపువలస, బీచ్ రోడ్డు మీదుగా వస్తున్న వాహనాలు ఊరిలోకి రాకుండా నిర్దేశించిన ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయాలను కల్పిస్తున్నారు. మెయిన్‌రోడ్డు గంటస్తంభం వేదిక, ఎగువపేట, చిన్నబజారు వేదికల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉత్సవం సందర్భంగా పలు దుకాణాలు ఏర్పాటు చేయడంతో సందడి వాతావరణం నెలకొంది.

రేపటి నుంచి పొట్నూరులో ..

పద్మనాభం: మండలంలోని పొట్నూరులో శనివారం నుంచి రెండు రోజులు నిర్వహించనున్న నూకాలమ్మ ఉత్సవాలకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది నూకాలమ్మ ఆలయం చుట్టూ మూడు సార్లు తిప్పుతారు. ఆదివారం ఆలయ సన్నిధిలో తిరునాళ్లు జరుగుతాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో, పరిసర ప్రాంతాల్లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు.

ఏప్రిల్ 11న సీపీఐ బహిరంగ సభ

తగరపువలస: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ ఏప్రిల్ 11 సాయంత్రం 4 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహిరంగసభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొంటారన్నారు. స్థానిక గుజ్జు రామునాయుడు భవన్‌లో గురువారం జరిగిన ఏరియా మహాసభలో ఆయన మాట్లాడారు. విశాఖలో మే 10,11 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా 27వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మాజీ కౌన్సిలర్ మావూరి సన్యాసమ్మ అధ్యక్షతన భీమిలి ఏరియా కార్యదర్శిగా కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, ఎరుసు అప్పలనరసయ్య, నూలు ఆదినారాయణ, అల్లం గోవింద్, పల్లా లక్ష్మణరావు, మాదాబత్తుల రామారావులను ఎన్నుకున్నారు. కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి, అప్పలసూరి పాల్గొన్నారు.

పీడీ రాము సేవలు ఎనలేనివి

మధురవాడ: పాఠశాలలో క్రమశిక్షణకు చక్కని బాట వేసిన పీడీ పెంటకోట రాము సేవలు ఎనలేనివని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి, పూర్వ ప్రధానోపాధ్యాయుడు రాజాబాబు కొనియాడారు. రాము ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాము, లక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. పీడీగా, యోగా శిక్షకుడిగా అనేక మందికి శిక్షణ ఇవ్వడమే కాకుండా చంద్రంపాలెం పాఠశాల విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, లలితకుమార్, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి గణపతి, చంద్రంపాలెం పాఠశాల ఉపాధ్యాయుల స్టాఫ్ సెక్రటరీలు రత్నరాజు, సునీత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పీడీ రాము దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నశ్రీనుకు పరామర్శ

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను జీవీఎంసీ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. చిన్న శ్రీను కుమారుడు ఆదిత్య ప్రణీత్‌బాబు ఇటీవల మృతి చెందడంతో విజయనగరంలోని ఆయన నివాసానికి వెళ్లి, ఓదార్చారు. ప్రణీత్‌బాబుకు నివాళులర్పించిన వారిలో చిప్పాడ వెంకటేష్, గుండాసి మధునాయుడు, తెడ్డాపు అప్పలరాజు, శీరపు శ్రీరాములు, సీపీ రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, బోర రామారావు, చిల్ల సూరినరసయ్య తదితరులు ఉన్నారు.

- వైఎస్సార్‌సీపీ రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో చేట్ల శ్రీనివాసరెడ్డి, నమ్మి మాధవరావు, ఊడికల శ్రీరామమూర్తి, సరగడ నాగిరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, శిల్లా వంశీ, గేదెల సన్యాసప్పడు తదితరులు ఆదిత్య ప్రణీత్‌బాబుకు నివాళులు అర్పించారు..

ఈకేవైసీ కోసం రేషన్ డీలర్ల వద్ద పడిగాపులు

తగరపువలస: ఆనందపురం, భీమిలి మండలాల్లోని రేషన్‌కార్డు దారులు ఈకేవైసీ కోసం డీలర్ల వద్ద పడిగాపులు ఉంటున్న సంఘటనలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. ఈ నెల 31లోగా ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ ఇవ్వరని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్లను తొలగించారు. దీంతో ఈ భారం డీలర్లపై పడింది. కొన్నిచోట్ల డీలర్లు ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ చేస్తున్నా సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీంతో కార్డుదారులు రాత్రి వరకు డీలర్ల ఇంటి వద్ద ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడువు దగ్గర పడుతుండటంతో ప్రత్యేక ఆధార్ కేంద్రాల ద్వారా ఈకేవైసీ చేయించాలని కార్డుదారులు కోరుతున్నారు.



ఆనందపురంలో డీలర్ వద్ద ఈకేవైసీ చేయించుకుంటున్న కార్డుదారులు